క్లుప్తంగా

తిర్యాణి ఎస్సై బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపడుతున్న ఎస్సై శ్రీకాంత్

తిర్యాణి: మండల నూతన ఎస్సైగా శ్రీకాంత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాంత్ ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్ నుంచి మండలానికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై మాధవ్‌గౌడ్ ములుగు జిల్లాకు బదిలీ అయ్యారు. ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

పల్లెల్లో సంక్రాంతి శోభ


దహెగాంలో గంగిరెద్దు విన్యాసం

దహెగాం: పల్లెల్లో సంక్రాంతి శోభ సంతరించుకుంది. గ్రామాల్లో గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకుంటున్నాయి. మండల కేంద్రంలో గత రెండు రోజుల నుంచి గంగిరెద్దులు సందడి చేస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా గంగిరెద్దులు కనుమరుగవుతున్న వేళ మండల కేంద్రంలో గంగిరెద్దు కానరావడంతో చిన్నారులు ఆసక్తిగా తిలకించారు.

ఘనంగా ఆదివాసీ ఆత్మగౌరవ దినోత్సవం


జెండా ఎగురవేస్తున్న ఆదివాసీలు

దహెగాం: మండల కేంద్రంతో పాటు పార్వతిపేట, బీబ్రా తదితర గ్రామాల్లో బుధవారం ఆదివాసీ ఆత్మగౌరవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ఆదివాసీ జెండా ఎగురవేశారు. అనంతరం పలువురు ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆదివాసీ ఆత్మగౌరవ, అస్తిత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బొట్లకుంట శ్రీనివాస్, మల్లేశ్, నీలేష్, కొడిపె నవీన్, నల్లి దామోదర్, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం కాంప్లెక్స్ హెచ్ఎం యాదగిరి ఆధ్వర్యంలో కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో రమేశ్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యార్థుల ప్రగతిని మెరుగుపర్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తరగతుల వారీగా నిర్దేశించిన ప్రమాణాలను సాధించడానికి కృషి చేయాలని సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ..
టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఎంపీడీవో అల్బర్ట్‌తో కలిసి ఎంఈవో రమేశ్‌బాబు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సతీశ్ పాల్గొన్నారు.

మహాభారత పద్య పఠన కార్యక్రమం


పఠనం చేస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో బుధవారం మహాభారత పద్య పఠన కార్యక్రమం నిర్వహించారు. చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి 31వ ఆరాధదినోత్సవం పురస్కరించుకుని స్వామి చిత్రపటానికి పూలమాల వేసి పద్య పఠనం నిర్వహించారు. హెచ్ఎం కోటేశ్వర రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

రెబ్బెన: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వృత్తి విద్య కోర్సుల శిక్షకుల ఎంపిక కోసం గురువారం జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. యోగా, డీటీపీ, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర కోర్సులు బోధించేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గురువారం ఉదయం 11 గంటలకు సంబంధిత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

కొలాంల కొంగు బంగారం ‘భీమన్న’

- నేటి నుంచి జాతర ప్రారంభం
- మూడు రోజులపాటు కొనసాగనున్న ఉత్సవాలు
- భారీ సంఖ్యలో హాజరు కానున్న ఆదివాసీలు


భీమన్న దేవర ఆలయం

తిర్యాణి: కొలాంల కొంగు బంగారంలా పూజలు అందుకుంటున్న మండలంలోని దంతన్‌పెల్లి భీమా అయ్యాక్ (భీమన్న దేవర) జాతర గురువారం నుంచి ప్రారంభం కానుంది. గత కొన్నేళ్లుగా కొలాంలు సంప్రదాయ బద్ధంగా భీమన్న దేవుడికి పూజలు చేస్తున్నారు. ఏటా జనవరిలో మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తున్నారు. కాగా ఇక్కడి దేవుడిని పూజిస్తే తాము అనుకున్న కార్యాలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో ఆలయానికి రోజురోజుకూ భక్తుల తాకిడి పెరుగుతోంది.

దట్టమైన అడవిలో వెలిసిన దేవుడు..
మండలంలోని దంతన్‌పెల్లి గ్రామ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో భీమన్న దేవర వెలిసింది. ఈ ఆలయం చుట్టూ అగ్నిదేవుడు, మైసమ్మ, పోచమ్మ, గ్రామ దేవతలు వెలిసి ఉన్నాయి. మండల కేంద్రం నుంచి దాదాపు 30 కిలో మీటర్ల దూరంలో ఆలయం ఉంటుంది. కాగా ఆత్రం వంశీయులు ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇదే వంశానికి చెందిన కొట్నాక, పెందూర్, గెడం, తొడసం, ఉర్వేత, కోర్కేట, ఉయిక, మరప, సలాం, కుడిమెత అనే తెగలకు చెందిన పూజారులు ఏటా ఇక్కడే మూడు రోజుల పాటు విడిది చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇక్కడ నిర్వహించే జాతరకు ఉమ్మడి జిల్లాలోని కొలాంలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆదివాసీలు సైతం తరలివస్తారు. కాగా ఈ ఏడాది జాతరను ఈ నెల 9 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. జాతరను పురస్కరించుకుని వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్లను సైతం నిర్వహించనున్నారు. దీంతో పాటు ఈ ఏడాది జాతరలో ఆదివాసీ కళాకారులు మహాభారం, పంచపాండవుల కథలను ప్రదర్శించనున్నారు. దీని కోసం ఇప్పటికే ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

బేటి ప్రత్యేకం..
మూడు రోజుల పాటు జరిగే జాతరలో సంప్రదాయ బద్ధంగా అనేక పూజలు నిర్వహించనున్నారు. మొదటిరోజు దేవస్థానంలోని దేవుని వన ప్రవేశం చేపట్టి, అనంతరం ఆదివాసీలకు చెందిన ఇతర దేవుళ్లతో కలిసి భీమన్న దేవుని ఆలయ ప్రవేశం చేస్తారు. అనంతరం బేటి అనే కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా కొత్త దంపతులు మట్టితో దేవుని ప్రతిరూపాలు తయారు చేసి వాటికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఆత్రం వంశానికి చెందిన పెద్దలకు కొత్త కోడళ్లను పరిచయం చేస్తారు. అప్పటి నుంచి వారందరిని ఆత్రం వంశ కోడళ్లుగా గుర్తిస్తారు. రెండోరోజు దేవుళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం జాతరతో పాటుగా దర్బార్‌ను నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం దేవుళ్ల వన ప్రవేశం చేపడుతారు. మూడో రోజు ఆలయంలోని అమ్మ వారికి (పోచమ్మ) ప్రత్యేక పూజలు చేపడుతారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



ఈనెల 9 నుంచి 11 వరకు దంతన్‌పల్లిలో జరిగే భీమన్న జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జాతర నిర్వహించే మూడు రోజులు పాటు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తాం. జాతరకు ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్ నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. – ఆత్రం గంగారాం, జాతర నిర్వహణ కమిటీ చైర్మన్

‘భక్తిభావంతో మానసిక ప్రశాంతత’


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతి ఒక్కరూ ధర్మ మార్గాన్ని అనుసరిస్తూ, భక్తిభావం కలిగి ఉంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో భజన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంజనేయస్వామి శోభాయాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శోభాయాత్ర పట్టణంలోని సాయిబాబా ఆలయం నుంచి జన్కాపూర్ కోదండ రామాలయం వరకు భజన కీర్తనలతో కొనసాగింది. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జీవితంలో సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ మల్లిఖార్జున్, వెంకటాచారి, దత్తా, మిట్ట తిరుపతి, శ్యాంరావ్, గోపాల్, మదునయ్య, జయరాజ్, మహేశ్, నాగేష్, శ్రీనివాస్, రమేశ్, భక్తులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు


దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రవీందర్

ఆసిఫాబాద్‌అర్బన్: నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రవీందర్ అన్నారు. జిల్లా ఎస్పీ డీవీ. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని గాలిపటాల దుకాణాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ చైనా మాంజాతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. చైనా మాంజా విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్సై రాజేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

సిబ్బందితో సమావేశం

లింగాపూర్: సిర్పూర్(యూ) మండల కేంద్రంలో బుధవారం 2024–25 సంవత్సరానికి సంబంధించిన పనులపై ఉపాధిహామీ క్షేత్రస్థాయి సిబ్బందితో ఎంపీడీవో కృష్ణారావు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో నర్సరీ పనులు పూర్తి చేయాలన్నారు. ఏపీవో కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీఐ రవీందర్

ఆసిఫాబాద్‌రూరల్: రోడ్డు భద్రతపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని సీఐ రవీందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై వెళ్తున్న క్రమంలో వాహనదారులు, పాదాచారులు ట్రాఫిక్ నిబంధనలు అనుసరిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. వాహనాలు నడుపుతున్న క్రమంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యాదగిరి, వైస్ ప్రిన్సిపాల్ అబ్దుల్ రహమాన్, అధ్యాపకులు సంతోష్, ప్రేమ్‌కుమార్, శంకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమదేవర జెండా పండుగ


కౌటాలలో వేడుకలు నిర్వహిస్తున్న మన్నెవార్లు


చింతలమానెపల్లిలో..


ఇందిరానగర్‌లో..

చింతలమానెపల్లి: మండలంలో బుధవారం ఘనంగా భీమదేవర జెండా పండుగ నిర్వహించారు. మండలంలోని గ్రామాలలో ఆదివాసీ ఆత్మగౌరవ భీమదేవర పండుగ సందర్భంగా మన్నెవార్(కొలవార్) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై బాజా భజంత్రీలతో సాంప్రదాయాలతో ర్యాలీ నిర్వహించారు. జెండా వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మన్నెవార్ల సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచన్న, నాయకులు మేకల ప్రసాద్, కిష్టయ్య, బుర్రి నీలయ్య, బుర్రి రూపేశ్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: కౌటాల మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం కొలవార్(మన్నెవార్ల) ఆత్మ గౌరవ దినోత్సవం పురస్కరించుకుని 23వ భీమదేవర జెండా పండుగ కార్యక్రమాన్ని ఆదివాసీలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని భీమన్న ఆలయాల్లో మహిళలు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని కొలవార్ సంఘం భవనం వద్ద నిర్వహించిన జెండా పండుగలో కొలవార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య పాల్గొని జెండా ఎగురవేశారు. కొలావార్ సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బా బాపు, మండలాధ్యక్షుడు ఆత్రం సత్తయ్య, నాయకులు కుర్మ రాజు, సత్తయ్య, సురేశ్, బాపు, గోపాల్, రవి, నాగయ్య పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని పులికుంట, ఇందిరానగర్, నక్కలగూడ, రోళ్లపాడు తదితర గ్రామాల్లో బుధవారం ఆదివాసీ కోలావార్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 23వ ఆత్మగౌరవ జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు చేసి భీమ దేవర జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను పాటిస్తూ భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఇందిరానగర్ గ్రామపెద్దలు దుర్గం జానయ్య, దుర్గం తిరుపతి, కుమ్మరి మల్లేశ్, ఎరుగటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘పది’ విద్యార్థులకు అల్పాహారం అందజేత


పండ్లు అందజేస్తున్న ఎంఈవో, నాయకులు

సాక్షి ఎఫెక్ట్..

ఆసిఫాబాద్‌రూరల్: పదవ తరగతి విద్యార్థుల ఆకలి తీర్చేందుకు ఎంఈవో సుభాష్, కాంగ్రెస్ నాయకులతో కలిసి పండ్లు, బిస్కెట్‌లను అందజేశారు. బుధవారం మండలంలోని గుండి, బూర్గుడ ఉన్నత పాఠశాలలో అల్పాహారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సాక్షిలో ఇటీవల వచ్చిన అర్ధాకలి చదువులు అనే కథనానికి స్పందించిన కలెక్టర్ వెంకటేశ్ దోత్రే జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం అందజేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కాగజ్‌నగర్ నియోజవర్గంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్‌తో పాటు కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ సహకారంతో అల్పాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చరణ్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.

సులభ్‌కాంప్లెక్స్‌ల నిర్మాణానికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలో సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించేదెప్పుడో? అని సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మున్సిపల్ అధికారులు జిల్లా కేంద్రంలో నాలుగు సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఆవరణ, కలెక్టరేట్ ఎదుట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రెండు సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలను ప్రారంభించనున్నట్లు క్లీన్ అండ్ గ్రీన్ సేవాసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్‌ఖాన్ బుధవారం తెలిపారు. ప్రజల డిమాండ్ మేరకు త్వరలో మరో రెండు సులభ్ కాంప్లెక్స్‌ల పనులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని, అక్రమ వెంచర్లు, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బుధవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇష్టానుసారంగా కొంత మంది వ్యక్తులు ప్రభుత్వ బీడీపీపీ భూములను స్వార్థ ప్రయోజనాల కోసం వెంచర్లు చేసి భవనాలను నిర్మిస్తున్నారని ఆరోపించారు. జిల్లా రెవెన్యూ అధికారులు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా అక్రమ కబ్జాలు ఆగడం లేదన్నారు. జిల్లా కేంద్రంలోని రాజంపేట అటవీ చెక్‌పోస్టు కేంద్రంగా బీడీపీపీలో లేఅవుట్లు వేసి భవనాలను నిర్మిస్తున్నారన్నారు. అక్రమ కబ్జాలను కొందరు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రభుత్వ భూములు కబ్జాలు చేసిన వారిపై తగు చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు దినకర్, రాజేందర్, కార్తీక్‌లు ఉన్నారు.

వార్షిక లక్ష్యసాధనకు సమష్టిగా కృషి చేయాలి


పని స్థలాలు పరిశీలిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్య సాధనకు ఏరియాలో పని చేసే కార్మికులంతా సమష్టిగా కృషి చేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి అన్నారు. బుధవారం ఏరియాలోని కైరిగూడ ఓసీపీని సందర్శించారు. ఈ సందర్భంగా క్వారీ లోపలికి వెళ్లి బొగ్గు బెంచ్‌లను సందర్శించారు. కంపెనీ నిర్దేశించిన ఉత్పత్తి ఉత్పాదకతలను అధిగమించేందుకు బొగ్గుతో పాటు ఓబీ మట్టి వెలికితీత పనులను పరిశీలించారు. క్వారీలో నీటిని ఎప్పటికప్పుడూ బయటకు పంపేందుకు సిద్ధం చేస్తున్న పైప్‌లైన్ డైవర్షన్ పనులను పరిశీలించారు. పని స్థలాల్లో ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం తీసుకుంటున్న రక్షణ చర్యలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఏరియా కార్మికులంతా రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తూ ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఉత్పత్తిలో ఏరియాను ముందు వరుసలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బయ్యమొగిళి, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కిరణ్‌బాబు, చంద్రశేఖర్, కమిటీ సభ్యులు నరేశ్ పాల్గొన్నారు.

పంచశీల్ జెండా వేడుకలు


కౌటాల: జెండా ఎగురవేస్తున్న మహర్ నాయకులు

కౌటాల: బుద్ధిస్ట్ పంచశీల్ జెండా దినోత్సవం పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని జేత్వన్ బుద్ధ విహార్‌లో మహర్ సంఘం ఆధ్వర్యంలో జెండా వేడుకలను మహర్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంచశీల్ జెండా ఎగురవేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గౌతమ బుద్ధుడు చూపిన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో కౌటాల మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, దుర్గం వెంకటేశ్, గోవింద్‌రావు, దిలీప్, పత్రు, జీవన్‌దాస్, ఆగయ్య పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో బుధవారం 145వ బౌద్ధ ధమ్మ ధ్వజ్ దినోత్సవాన్ని భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచశీల్ జెండాను ఆవిష్కరించి త్రిశరణ్, పంచశీల సూత్రాలతో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ 1880 జనవరి 8న శ్రీలంకలో ఆర్‌డీ సిన్హా ధమ్మ ధ్వజాన్ని ఆవిష్కరించినట్లు తెలిపారు. బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోలకర్, మండల అధ్యక్షుడు జైరాం ఉప్రె, నాయకులు హిరిషన్, రాజేంద్రప్రసాద్, హంసరాజ్, రోషన్, శ్యాంరావు, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన ఉండాలి


కెరమెరి: మాట్లాడుతున్న ఎస్సై విజయ్

కెరమెరి: సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై గుంపుల విజయ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటీపీ నంబర్లు ఎవరికీ చెప్పవద్దని, 1930, 100కు కాల్ చేయాలని పేర్కొన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, అతి వేగంగా, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వాంకిడిలో..
వాంకిడి: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ప్రశాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. డిజిటల్ బ్యాంకింగ్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ వచ్చినా, ఓటీపీ వివరాలు అడిగినా చెప్పొద్దని సూచించారు. ఒకవేళ సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులకు సైబర్‌నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్‌లు చేస్తున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారన్నారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విపత్కర పరిస్థితుల్లో పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బాలికలకు చట్టం అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌వో కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కెరమెరి: మండలంలోని మోడి కస్తుర్బా గాంధీ విద్యాలయంలో ఖాళీగా ఉన్న అతిథి సీఆర్టీ, పీజీ సీఆర్టీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్టీ (హిందీ, ఇంగ్లిషు), పీజీ సీఆర్టీ (రసాయనశాస్త్రం) పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సీఆర్టీ పోస్టులకు బీఈడీ, పీజీ సీఆర్టీ పోస్టులకు ఎంఎస్సీ బీఈడీ అర్హత ఉండాలని తెలిపారు. మెరిట్ అధారంగా నియామకం ఉంటుందని, జిల్లావాసులకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. అర్హత గల మహిళా అభ్యర్థులుఈ నెల 10 సాయంత్రం 4:30 గంటల లోపు కేజీ బీవీలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

కౌటాల: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి పవిత్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో హిందీ, సోషల్ సబ్జెక్టుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పీజీతో పాటు బీఈడీ పూర్తి చేసిన మహిళ అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోపు కౌటాల కేజీబీవీలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

పెంచికల్‌పేట్: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితం, హిందీ, పీఈటీ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోపు సంబంధిత జిరాక్సు పత్రాలతో కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చట్టాలపై అవగాహన సదస్సు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని గన్నారం రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీటీం, భరోసా సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. భరోసా సెంటర్ మహిళా ఎస్సై తిరుమల, షీటీం సభ్యులు రమాదేవి, సునీత మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్‌లకు ఎవరైనా గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలన్నారు.